# భలే పెళ్ళి!

- రత్నాకరం ప్రసాద్ వర్మ

''కొడితే ఏనుగు కుంభస్థలాన్నే కొట్టాల్రా'' కళ్ళజోడు సవరించుకుంటూ సీరియస్‌గా చెప్పాడు గణపతి.

''అవన్నీ సింహాలవంటి క్రూర మానవులకి బ్రదర్. మనం సాధు జంతువుల్లాంటోళ్లం'' నచ్చ చెప్పే ధోరణిలో అన్నాడు శివ.

''నువ్వెన్నయినా చెప్పు, నా నిర్ణయం మారదు. హాస్పిటల్ పెట్టి తీరుతాను. సంవత్సరం తిరిగేలోగా మన దశ తిరిగిపోవాలి'' పట్టుదలగా చెప్పాడు గణపతి.

''బియ్యే నాలుగుమార్లు తప్పిన నువ్వు డాక్టరవుతున్నా నంటే నాకు నవ్వొస్తోంది బ్రదర్''

''నవ్వు కాదురా. కుళ్ళు! నే డాక్టరునై ఎక్కడ బాగుపడి పోతానోనని కుళ్ళు.''

''ఛ..ఛ.. నాకెందుకు కుళ్ళు. యింతకీ జ్వరానికి ఏ మందివ్వాలో అయినా తెలుసా..అని.'' అర్థోక్తిగా అన్నాడు శివ.

''మా బాగా తెలుసులేవోయ్. ఆర్.యమ్.పి. డాక్టరు దగ్గర ఆర్నెల్లు కాంపౌండర్‌గా పని చేసా. ఆ మాత్రం తెలియదేంటి.''

''అంతా డాక్టర్లు కావడానికి లక్షలకు లక్షలు ఖర్చుపెట్టి, ఏళ్ళ తరబడీ చదువుతుంటే, నువ్వు ఆర్నెల్లలోనే డాక్టరవడం భలే తమాషాగా ఉంది రా.''

''మేమూ పెట్టాంలేవోయ్ ఖర్చు! హోమియోపతి డాక్టరుగా సర్టిఫికెట్ సంపాదించడానికి వెయ్యి, మిగతా సామగ్రికీ నాలుగు వేలు వెరసి మొత్తం అయిదువేలయింది'' ఐదువేళ్ళు పైకెత్తి చూపించాడు గణపతి.

''అయితే ఆ పల్లెటూళ్ళో క్లినిక్కు ప్రారంభానికి అన్నీ సిద్ధం అయినట్టే నన్న మాట.''

''అన్నీ రెడీగా ఉన్నాయ్. రేపే ప్రయాణం. ఆ చుట్టుప్రక్కల ఇరవై కిలోమీటర్ల దూరంలో ఎక్కడా హాస్పిటల్సే లేవు'' చెప్పాడు గణపతి.

అన్నట్టుగానే ఆ మరుసటి రోజే ఆ ఊళ్ళో క్లినిక్కు ప్రారంభించేశాడు గణపతి. ఆ ఊరి ప్రజలకు జబ్బు చేస్తే టౌనుకు వెళ్ళడమో లేక నాటు వైద్యం చేయించుకోవడమో తప్ప వేరే దారే లేదు మునుపు. యిప్పుడు గణపతి హాస్పిటల్‌కే ఎగబడ్డారంతా.

శివ, గణపతి మంచి స్నేహితులు. గణపతికి యిరవై ఎనిమిదేళ్ళుంటాయ్. తన బియ్యే చదువుకు రాని ఉద్యోగం కోసం ఎదురు చూసి, చూసి చివరికీదారి ఎంచుకున్నాడు.

అందుకు మరో కారణం కూడా ఉంది. వయసు మీరి పోతున్నా సరయిన జీవనోపాధి లేకపోవడంతో ఎవరూ పిల్లనివ్వడానికి ముందుకు రాలేదు. డాక్టరనిపించుకుంటే మంచి సంబంధం కొట్టెయ్యొచ్చని ప్లాన్.

మందులు టౌన్ నుండీ తనే తెచ్చి, పేషెంట్లకు రెండు మాత్రలు చేతిలో పెట్టి, ఓ సూది పొడిచి, పది రూపాయలు వసూలు చెయ్యసాగాడు.

ఆర్నెల్లు బాగానే గడిచాక గణపతిని చూడ్డానికొచ్చాడు శివ.

''ఏం బ్రదర్. వ్యాపారం ఎలా సాగుతోంది?'' వచ్చీ రాగానే అడిగాడు శివ.

''ఏం వ్యాపారం?'' కాస్త కోపంగా అడిగాడు గణపతి. ఆ వూరి పెద్దమనిషి నాగయ్యతో పిచ్చాపాటి మాట్లాడుతున్న సమయంలో వచ్చి డిస్టర్బ్ చేసినందుకు విసుక్కుంటూ.

''అదేనోయ్. టౌన్‌లో మందులు తెచ్చి యిక్కడ అమ్ముకుంటున్నావటగా, ఆ వ్యాపారం'' ఎదురుగా కూర్చుంటూ వివరించాడు శివ.

గణపతి కాస్త యిబ్బందిగా మొహం పెట్టాడు.

పెద్ద మనిషి పరిస్థితి గ్రహించినట్లు పైకి లేచి ''సరేసార్. తరువాత కలుస్తా. కాస్త పనుంది'' పళ్ళు బయట పెట్టి అన్నాడు.

గణపతి చటుక్కున పైకి లేచి ''అలాగే'' అన్నాడు తనూ పళ్ళికిలిస్తూ.

''ఒరే అడ్డగాడిదా నీకు బుద్ధుందట్రా'' పెద్ద మనిషటు వెళ్ళగానే గయ్యిమన్నాడు గణపతి.

''ఉండబట్టే కదరా నిన్ను వెతుక్కుంటూ ఇక్కడకొచ్చింది!'' ఆశ్చర్యపడుతూ అన్నాడు శివ.

''అవతల పెద్ద మనిషితో మాట్లాడుతుంటే వెధవ్వాగుడు వాగుతావా?''

''నేనేం విడ్డూరాలు మాట్లాడలేదే! ఉన్నదేగా అన్నాను'' బుర్రగోక్కున్నాడు శివ.

''అదిగో..మళ్ళీ అదే దారి..యిప్పుడీ ఊర్లో నా గౌరవం, పలుకుబడి తెలిస్తే నువ్విలా మాట్లాడవు.''

''మరెలా మాట్లాడుతాను?''

''సర్లే...అవన్నీ ఎందుగ్గానీ, యింతకీ ఏమిటి మనూర్లో విశేషాలు. నాకేమయినా పెళ్ళి సంబంధాలొచ్చాయా?'' అసలు విషయానికొచ్చాడు గణపతి.

''రాకేం. నువ్వు డాక్టరువయ్యావని మీ నాన్న ఫోర్‌ట్రాక్ సౌండ్ సిస్టమ్‌లో ప్రచారం చేస్తున్నాడాయె. అయినా మనకు తెలిసిన బంధువు లెవరూ నమ్మలేదనుకో. కొత్త సంబంధాలు రెండొచ్చాయి. నువ్వు వచ్చి అమ్మాయిని చూసి, యిష్టపడితే, బేరసారాలు చేసుకోవలసిందిగా మీనాన్న చెప్పిరమ్మంటే ఇలా వచ్చాను.''

''ఆ..! నేను చూసేదేంట్రా, ఎవరు ఎక్కువ కట్నమిస్తామంటే ఆ సంబంధం ఖాయం జేసి ముహూర్తం పెట్టించెయ్యమను.''

''మరి వాళ్ళు నిన్ను చూడాలంటేనో?''

''వీలుపడదు, చాలా బిజీగా ఉన్నాడని చెప్పమను. వాళ్ళ వెధవ ప్రశ్నలకు జవాబు చెప్పే ఓపిక నాకు లేదు.''

''ఒకప్పుడు పెళ్ళి చేసుకోవడానికి అమ్మాయి దొరక్క ఎన్నోచోట్ల తిరిగావ్. ఇప్పుడు సంబంధాలే నిన్ను వెతుక్కుంటూ వస్తున్నాయ్. అంతా విధిలీల బ్రదర్.''

''విధిలీల కాదు బ్రదర్..తెలివితేటలు..మరో విషయం..అమ్మాయి ఏదయినా ఉద్యోగం చేస్తుంటే-కట్నంలో కొంచెం డిస్కవుంటు యివ్వమను'' అన్నాడు గణపతి.

★★★

గణపతి చేసిన వైద్యాలు ఒకటి రెండు వికటించాయి. ఒకతనికి ఇంజక్షన్ సరిగ్గా చెయ్యకపోతే సెప్టిక్కయి టౌనుకి పరిగెత్తాడు. మరికొంచెం ఆలస్యం అయ్యుంటే ప్రమాదం ముంచుకొచ్చేదన్నారు డాక్టర్లు.

మరొకతనికి యింజక్షన్ రియాక్షనిచ్చి నానా హంగామా అయింది.

ఈ సంఘటనతో గ్రామ ప్రజల్లో గణపతిపై నమ్మకం సన్నగిల్లింది. క్రమంగా హాస్పిటల్‌కు వచ్చే జనం పలుచబడ సాగారు. గణపతికి మళ్ళీ బెంగ పట్టుకుంది. పెళ్ళికాకుండానే ఎక్కడ క్లినిక్కు మూసి వెయ్యవలసి వస్తుందోనని.

గణపతి అలా క్లిష్ట పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతుండగా వచ్చాడు శివ.

''నీకో శుభవార్త బ్రదర్''

''ఏమిట్రా అది'' మునుపంత ఉత్సాహం లేదు గణపతిలో.

''పెళ్ళి వార్త చెబుదామని వస్తే-అలా మొహం వేలాడేస్తావేం బ్రదర్, యింతకీ అమ్మాయి ఏం

చేస్తోందో తెలుసా? పట్నంలో యింజనీరుగా పనిచేస్తోంది.''

''అవునా?'' ఆనందంతో అరిచినంత పన్చేశాడు గణపతి.

''అవును బ్రదర్. జీతం నెలకు యింత...'' నాలుగువేళ్ళు ఎత్తి చూపించాడు శివ.

''అదేంటి బ్రదర్..అలా చూపిస్తే ఎంతని''

''ఏమో! పెళ్ళి కూతురు తండ్రి కూడా అచ్చు యిలాగే చూపించాడు బ్రదర్.''

''నాలుగు వేలయ్యుంటుంది లేరా. ఇంజనీరన్నావ్. ఆ మాత్రం ఉండదేంటి''

''ఉండొచ్చు''

తలూగించాడు శివ.

''ఇంతకీ కట్నం వ్గైరాల విషయం ఏంటి?''

''ఇంజనీరన్నాక మళ్ళీ కట్నం అడిగితే ఏం బావుంటుందని మీ నాన్న అడగలేదు. అయినా ఆ అమ్మాయి తండ్రే పదో పరకో యిస్తా మన్నాడు.''

''త్వరగా పెళ్ళయితే నేనూ టౌనుకి చెక్కేస్తాన్రా. యిక్కడ ప్రాక్టీసు కూడా అంతంత మాత్రంగానే వుంది.''

''మీనాన్న కూడా అదే మాటన్నాడు. అవునూ, ఆ తరువాత విషయం తెలిసి అమ్మాయివాళ్ళు గొడవ చేస్తేనో?''

''యం.బి.బి.యస్. చదవకుండానే డ్క్టరయినోణ్ణి. ఆమాత్రం మానేజ్ చెయ్యలేనటోయ్?'' ధీమాగా అన్నాడు గణపతి.

★★★

పెళ్ళి ఏర్పాట్లు చేసుకోవడానికి వెంటనే శివ వెంట బయల్దేరాడు గణపతి.

ఏర్పాట్లు చురుగ్గా సాగిపోతున్నాయి. బంధు బలగం రెండ్రోజులుముందే వేంచేసి తేరగా తింటూ గణపతి అదృష్టాన్ని వేనోళ్ళ పొగిడేస్తున్నారు.

పెళ్ళి ఘడియ రానే వచ్చింది. ఉన్నంతలో పెళ్ళి బాగానే జరిపించాడు పెళ్ళి కూతురు తండ్రి.

శోభనం గదిలో పాల గ్లాసుతో అడుగు పెట్టింది పెళ్ళికూతురు అంజలి.


గ్లాసుడు పాలూ యిద్దరూ స్వాహా చేశాక మెల్లగా అంజలిని దగ్గరకు తీసుకుంటూ చెప్పాడు గణపతి.

''నీవు ఆ పల్లెటూళ్ళో ఉండలేవు. అందుకని నేను కూడా పట్నం వచ్చేద్దా మనుకుంటున్నా.''

''అబ్బే..ఎందుకులెండి. నేను పల్లెటూళ్ళో ఉండగలను. నాకు పల్లెటూళ్ళంటే చాలా యిష్టం.'' సిగ్గు పడింది పెళ్ళికూతురు.

''బంగారం లాంటి ఉద్యోగం వదులుకుని ఆ పల్లెటూళ్ళో ఎలా ఉండగలవు. నీవు కష్టపడితే నేను చూడగలనా?'' తల నిమిరాడు గణపతి.

''పోతే పోయింది- బోడి ఉద్యోగం. మీకన్నా నాకు ఉద్యోగం ముఖ్యమా'' అతని ఛాతీ మీద తల ఆన్చింది అంజలి.



''నువ్వెన్నయినా చెప్పు. నెలకు నాలుగు వేలు జీతం వచ్చే యింజనీరు ఉద్యోగం వదులుకోవడం నాకు యిష్టం లేదు.''

''నాలుగు వేలేమిటి, నాలుగు వందలేగా'' మళ్ళీ సిగ్గుపడింది పెళ్ళికూతురు.

''నాలుగు వందలా? ఇంతకూ నువ్వు చేసేది యింజనీరు ఉద్యోగమేనా?'' ఆశ్చర్యంగా అడిగాడు పెళ్ళికొడుకు.

''యింజనీర్నే, సర్వీసింగు (రిపేర్) ఇంజనీర్ని. పది పాసవగానే మా నాన్న ఐ.టి.ఐ. చదివించాడు. ఇప్పుడు ఓ టీవీ షాపులో రేడియోలు టీవీలు అవీ రిపేర్ చేసే ఉద్యోగమన్న మాట.'' గణపతి మొహంలో వస్తున్న మార్పులు గమనించకుండా అమాయకంగా ఛాతీపై వేళ్ళో రాస్తూ చెప్పింది అంజలి.

''ఓర్నాయనో..నువ్వూ, మీ నాన్న కలిసి నా కొంప ముంచారు కదే.''

''కొంప ముంచడమేమిటి? మీరింతకూ అమెరికా ఎప్పుడెళ్తున్నారు?'' ఆశ్చర్యంగా చూస్తూ అడిగింది నవ వధువు.

''అమెరికాకెందుకు...గోల్డెన్ బ్రిడ్జ్ పై నుండి దూకి చావడానికా'' చిరాగ్గా అన్నాడు గణపతి.

''మీ నాన్న మాకన్నీ చెప్పాడ్లెండి. డాక్టరుగా అమెరికా వెళ్ళడానికి వీసా వచ్చిందటగా.''

''వీసానా, నా బొందా! అమెరికా వెళ్ళడానికి నేనేమయినా ఎం.బి.బి.యస్. డాక్టర్నా?''

''కాదా?''

''కాదు, ఆరెంపీ డాక్టర్ని''

''ఓలమ్మో..నా కొంప కొల్లేరయింది. ఎం.బి.బి.యస్ డాక్టరని చెప్పి మీ నాన్న నన్ను నిలువునా ముంచాడు'' గొల్లుమంది పెళ్ళికూతురు.

''ఇంజనీరువని చెప్పి మీనాన్నే నా కొంప ముంచాడు'' కయ్యిమన్నాడు గణపతి.

ఇదే సమయంలో నూరు అబద్ధాలాడయినా ఓ పెళ్ళి చేయమన్న పెద్దల మాట తూచా తప్పకుండా పాటించిన పెళ్ళికొడుకు తండ్రి, పెళ్ళికూతురు తండ్రి డాబా మీద పడుకుని, హాయిగా నిద్దర్లోకి జారుకున్నారు.

★